క్లుప్తంగా

ఇన్నర్ రింగ్ రోడ్డును పూర్తి చేస్తాం



ఇన్నర్ రింగ్‌రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: పట్టణంలో త్వరితగతిన ఇన్నర్ రింగ్‌రోడ్డును పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ సభ్యులు రషీద్ తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో గురువారం నూతన ఇన్నర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.20 కోట్లతో పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఏడు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు, ఇరువైపులా మూడు అడుగుల వెడల్పుతో మురుగు కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రద్దీ తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఏఈ షఫీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పీ 4 సర్వే పట్ల నిర్లక్ష్యం చేయరాదు



హాజరుపట్టీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: పీ4 సర్వే పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని జూటూరు, పాములపాడు2(రుద్రవరం) గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. పీ 4 సర్వే ఎంత వరకు జరిగిందని, ప్రోగెస్‌పై ఆరా తీశారు. త్వరిగతిన సర్వే పూర్తి చేసి బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

బిడ్డలకు తల్లిపాలే శ్రేయస్కరం




తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బిడ్డలకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు హరిత, నాగమణి, ఏఎన్ఎం నాగ మల్లేశ్వరి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లులు బిడ్డలకు క్రమం తప్పకుండా పాలు ఇవ్వడం వల్ల తల్లి రొమ్ము క్యాన్సర్ బారిన పడరన్నారు. బిడ్డకు ముర్రు పాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

- **బండి ఆత్మకూరు:** తల్లిపాలే బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాలు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెలుగోడు: పట్టణంలోని సచివాలయం-2లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ తదితర వాటి కోసం ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసింది. పలు కాలనీల నుంచి ఆధార్ సమస్యలున్న వారంతా సచివాలయాలకు వస్తుంటారని, ఆలస్యం లేకుండా దరఖాస్తులు స్వీకరించి, ఆధార్ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ తెలిపారు. అలాగే సర్వేలను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈఓ నాగేంద్ర ఉన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం

నందికొట్కూరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 10న బహిరంగ వేలం వేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనదలచిన వారు నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించాలన్నారు.

వేళకురారు.. సమస్యలు పరిష్కరించరు!



సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



సచివాలయ ఉద్యోగుల కోసం చెట్ల కింద వేచిచూస్తున్న గిరిజనులు

కొత్తపల్లి: మండల పరిధిలోని పెద్ద గుమ్మడాపురం గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న గుమ్మడాపురం, సింగరాజు పల్లె, గుమ్మడాపురం గూడెం వాసులకు ఇదే సచివాలయం. వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన ప్రజలకు సిబ్బంది లేకపోవడం నిత్యకృత్యమవుతోంది. గురువారం కూడా ఇదే సమస్యే ఎదురైంది. కొంతమంది గిరిజనులు, ఇతర గ్రామస్తులు క్యాస్ట్, రాబడి ధ్రువపత్రాల కోసం, మరి కొన్ని సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి ఉదయమే చేరుకోగా సిబ్బంది 11:30 గంటలైనా రాకపోవడంతో చెట్ల కింద పడిగాపులు కాశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శుల నుంచి, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ తదితర ఉద్యోగులెవరూ కూడా సమయానికి రాకపోవడంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకుని వచ్చినా ఉద్యోగులు ఉండటం లేదని, దీంతో పరిష్కారం కావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కోరుతున్నారు



పాచి పట్టినా పట్టించుకోరా?

పగిడ్యాల: రక్షిత మంచినీటి సరఫరా ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. అందుకు లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ సరఫరా కోసం వేసిన పైప్‌లైన్ వాల్వ్‌లే నిదర్శనం. అడుగడుగునా కలుషితమైన పాచిపట్టిన నీటిని సరఫరా చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ట్యాంక్ ద్వారా పగిడ్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే వాల్వ్‌ల వద్ద లీకేజీ అయిన నీరు నిండుకుని పాచి పట్టి దుర్గంధం వెదజల్లుతోంది. లక్ష్మాపురం – పగిడ్యాల గ్రామాల మధ్య మద్దిలేటి రెడ్డి పొలం వద్ద ఉన్న వాల్వ్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పాచితోపాటు తోక పురుగులతో నిండుకుంది. ఈ నీటిని తాగితే ప్రాణాంతక రోగాల బారినపడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాల్వ్‌ల్లో పేరుకుపోయిన పాచిని తొలగించి లీకేజీ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుని, రక్షిత నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యత బ్రోచర్లు విడుదల చేస్తున్న అధ్యాపకులు

శ్రీశైలంప్రాజెక్ట్: వర్తక, వాణిజ్య లావాదేవీలు జరపడానికి ఆర్థిక అక్షరాస్యత అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి. హుస్సేన్‌బాషా అన్నారు. గురువారం కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ, కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ తయారీ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, బ్యాంకింగ్, ఆడిటింగ్, లెడ్జర్ల నిర్వహణ ఆర్థిక అక్షరాస్యతతోనే సాధ్యమన్నారు. ఇలాంటి విషయాలపై అవగాహన లేకుండా వ్యాపారాలు చేయడం, ఆర్థిక లావాదేవీలు నడపడం నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎం.బుచ్చయ్య, డా.ఎం.పద్మ, షాహీదా, ఎస్.మహేశ్వరరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, ఎస్.శివనాగిరెడ్డి, పూర్ణేశ్వర్‌రెడ్డి, ఆర్థిక కౌన్సిలర్ బి.విజయ్‌రాజు, సీఎఫ్ఎల్ ఓ.శంకర్ కల్పించారు.

సమస్యలను పరిష్కరించాలి

పాములపాడు: ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇస్కాల గ్రామానికి వెళ్లడానికి భవనాశి వాగుపై వంతెన నిర్మాణంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బనకచెర్ల, బానుముక్కల, గుండాలనట్లు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. నేషనల్ హైవే 340సీ పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

నేడు వరలక్ష్మీ వ్రతం

మహానంది: మహానందిలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే మహిళలకు పూజ సామాగ్రి, ప్రసాదాలు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా ఇస్తారన్నారు. ఉదయం 10:30 నుంచి వ్రతం ప్రారంభమవుతుందన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వ్రతంలో పాల్గొనాలన్నారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లో గురువారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వర్షాలు లేక వరుణుడి కరుణ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్న సమయంలో వర్షం రాక రైతులకు కొంత ఊరట ఇచ్చింది.

దాడి చేయడం హేయమైన చర్య

జూపాడుబంగ్లా: కడప ఉప ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల రమేష్ యాదవ్, జెడ్పీ చైర్మన్ ఉప్పల హారికపై జరిగిన దాడిని ఆయన గురువారం ఖండించారు. పారుమంచాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బీసీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్, నాగరత్నం, జాకీర్‌హుసేన్, ఇబ్రహీం, స్వామిదాస్, ఇమ్మానియేలు, శివ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

నందికొట్కూరు: చేనేత కుటుంబాలకు ఇచ్చిన హామీలు అమలు చేసి ఆదుకోవాలని తొగటవీర క్షత్రియ సేవాసమితి జిల్లా అధ్యక్షులు కొప్పుల సత్యనారాయణ కోరారు. గురువారం చేనేత కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షులను కుల సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు హ్యాండ్లూమ్ వస్త్రాలపై ఉన్న జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలన్నారు. సమావేశంలో చేనేత సంఘం నాయకులు రవీంద్రబాబు, వేణుగోపాలు, శ్రీనివాసులు, గోవర్ధన్‌గిరి, రామచంద్రుడు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న సీఐ రాము,



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆత్మకూరు పట్టణ సీఐ రాము సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకన్న, ఎల్‌బీసీ మేనేజర్ పాండురంగనాయక్, పూర్వపు విద్యార్థి వేణు, రిటైర్డ్ పీఈటీ శివలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయండి



పోస్టర్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఉమర్, వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఉమర్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన తన కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో బైర్లూటీ వైద్యాధికారి పవన్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ కుదూజ్, సూపర్‌వైజర్ మస్తానయ్య, పబ్లిక్ హెల్త్ నర్సు భ్రమరాంబ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ రమణమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



ధర్నా చేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా ఇప్పటి వరకు నూతన పింఛన్‌లు, పక్కా గృహాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. చాబోలు, పోతులపాడు, 80 బన్నూరు, కొత్త సిద్దేశ్వరం, రామసముద్రం గ్రామాల ప్రజలకు జూపాడుబంగ్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్త సిద్దేశ్వరంలోని గిరిజనులు, ఎస్సీలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అందజేశారు.

బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం టోల్‌గేట్ సమీపంలో రామయ్య టర్నింగ్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. శ్రీశైలానికి చెందిన హరి(23), అతని భార్య పని నిమిత్తం సున్నిపెంటకు బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో సున్నిపెంట నుంచి శ్రీశైలం వస్తున్న ద్విచక్రవాహనదారుడు.. వీరి బైక్‌ను ఢీకొనడంతో హరి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. మృతుడు హరి శ్రీశైలం బస్టాండ్ సమీపంలో బడ్డీకొట్టు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఆత్మకూరు, నంద్యాల క్లస్టర్‌ల ఏసీ, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పొదుపు మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు వెలుగు సిబ్బంది కృషి చేయాలన్నారు. పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఎలా చెల్లించాలన్న దానిపై వివరించారు. అనంతరం క్లస్టర్‌లలోని సిబ్బందికి పొదుపుపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా డీపీఎంయూ హనుమంతనాయక్, ఆత్మకూరు ఏపీఎం కాశేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సేవలు మరువలేనివి



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు మాబాషా, వీరన్న, సుధాకర్ అన్నారు. పట్టణంలోని కృషి పండ్లతోటల సంఘం కార్యాలయంలో స్వామినాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో హరిత విప్లవానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బైరాపురం మహబూబాషా, రణధీర్, రాంనాయక్, రసూల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- **పాములపాడు:** స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్వామినాథన్ జయంతి సందర్భంగా స్థానిక నెమలి వెంకటరెడ్డి భవన్, సీపీఎం కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అద్భుతమైన నూతన వంగడాలను సృష్టించి హరిత విప్లవపితామహుడిగా స్వామినాథన్ పేరు గాంచారన్నారు. జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా ఆయన చేసిన సిఫారసులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న, రైతు సంఘం నాయకులు గాలిగౌడు, ఎస్ఆర్ బాలయ్య, మేకల రాజు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

వెలుగోడు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు వి.నాగమోహన్, సీపీఎం మండల కార్యదర్శి మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్‌ల బిగింపును రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల బిగింపు ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు వెంకటయ్య, నాయకులు రహంతుల్లా, జి.బాషా, ఆంజనేయులు, భాస్కర్, మహమ్మద్, వలి, రామకృష్ణ, నాగరాజు, అబ్దుల్లా, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలి

బండి ఆత్మకూరు: మంచి నడవడిక అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాలలో ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసమే జీవితానికి తొలిమెట్టని, అందువల్ల విద్యార్థులు కష్టపడి చదివి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఇటీవల పదవీవిరమణ పొందిన మ్యాథ్స్ లెక్చరర్ రామసుబ్బారెడ్డిని సహచర అధ్యాపకులు సత్కరించారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథరెడ్డి, నజీరుద్దీన్, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం తాలూకా అధ్యక్షులు నర్సరాజు

నందికొట్కూరు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షులు నర్సరాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, గ్రామ వార్డు సచివాలయ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలన్నారు. డాక్టర్లకు నాన్ ప్రైవేట్ ప్రాక్టీస్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు భువనేశ్వరి, రాముడు, మద్దిలేటి, నూరుల్లా, కృష్ణమూర్తి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



శ్రీనివాసులు మృతదేహం

కొత్తపల్లి: భార్యాభర్తల మధ్య తలెత్తిన తగాదాలకు మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఏఎస్ఐ రామ్ నాయక్ తెలిపిన వివరాలు.. మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన బండి శ్రీనివాసులు(58), భార్య సరోజమ్మ తరచూ ఆస్తి కోసం ఘర్షణ పడుతూ ఉండేవారు. ఈక్రమంలో ఈనెల 5న శ్రీనివాసులు గ్రామ శివారులో పురుగు మందు తాగి పడివుండటం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి ఉంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బండి గురువారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తిచేయండి



గ్రామ పెద్దలు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందీశ్వర స్వామి దేవస్థానానికి దత్తత ఆలయమైన తమ్మడపల్లె గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం గ్రామానికి చేరుకుని కాశీ విశ్వేశ్వర స్వామి బాలాలయం గురించి గ్రామ పెద్దలతో చర్చించారు. పనులు త్వరగా మొదలు పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆయన సూచించారు.